www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 14 జూన్ 2024





మొక్కకు నీరు పోస్తున్న డిఇఒ అనురాధ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ

ప్రజాశక్తి -చింతకొమ్మదిన్నె

మానవ మనుగడకు అతి ముఖ్యమైన పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ పేర్కొన్నారు. పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా మేరీ లైఫ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హై స్కూల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రతి పాఠశాల ఆవరణాన్ని శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి పాఠశాల స్థాయి నుంచే పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ, ఇంధన పొదుపు, సరైన పోషణ గురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ప్రతి పాఠశాల ఆవరణంలో పచ్చదనం ఫరిఢవిల్లాలన్నారు. అనంతరం స్టూడెంట్ కిట్‌లను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు విద్యార్థులతో కలిసి నాటారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖధికారులు వెంకట రామిరెడ్డి, రమాదేవి, సమగ్ర శిక్ష అధికారులు దశరథ రామిరెడ్డి, మిట్టా కేశవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఉపాధ్యాయులు గంగాధర్, ప్రతాప్, గురవయ్య, శివ పాల్గొన్నారు.





శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు

కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లాలో ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సబ్ డివిజనల్ ట్రైనింగ్స్ ఆన్ కేన్సర్ స్క్రీనింగ్ అండ్ అర్లీ డిటెక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు కేన్సర్ స్క్రీనింగ్, అర్లీ డిజాక్షన్‌పై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో మూడు బ్యాచ్‌లుగా రిమ్స్ కడప, డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ప్రొద్దటూరు, జనరల్ హాస్పిటల్ పులివెందుల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు, ఎమ్ఎల్‌హెచ్‌పి, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలకు కేన్సర్ అవగాహన శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కేన్సర్ స్క్రీనింగ్ 30 సంవత్సరాలు పైబడిన ఆడవారికి ఎఎన్ఎంలు ద్వారా నోటి కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్, మగవారికి నోటి కేన్సర్ మీద స్క్రీనింగ్ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎన్‌సిడి డాక్టర్ సౌజన్య, డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, జిజి హెచ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుర్వేశ్వర రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, డాక్టర్. గోపికృష్ణ, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్

ప్రత్యేక హోదా కోసం టిడిపి పాటుపడాలి

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదాను సాధించడంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ముందుండాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, ఆర్‌టిఐ చైర్మన్ మామిళ్ల నరసింహులు, మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు –అక్రమ్, మైనారిటీ సెల్ సిటీ చైర్మన్ ఆసిఫ్‌ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏపీ రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదాను 2014లో విభజన హామీలతో పాటుగా పార్లమెంటులో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రకటించారు అన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఏపీ ప్రత్యేక హోదా విషయాన్ని తుంగలో తొక్కిందన్నారు. తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ అంటూ ప్రత్యేక ప్యాకేజీ కానీ ప్రత్యేక హోదా కానీ రెండు సాధించలేకపోయింది అని తెలిపారు. తర్వాత అధికారంలో కూర్చున్న వైసిపి ప్రభుత్వం ప్రత్యేక హోదా సాధించడానికి కేంద్రంతో పోరాడటానికి 25కు 25 సీట్లు ఇమ్మని ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుని జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక తనపై ఉన్న కేసులు, అరెస్టులకు భయపడి బిజెపికి జీ హుజూర్ దాసోహం అన్నాడు అని తెలిపారు. దీంతో టిడి పి , వైఎస్ఆర్‌సిపి పార్టీలు ప్రత్యేక హోదా సాధించలేవని ప్రజలకు తేటతెల్లమైంది అన్నారు. ఇప్పుడు అధిక ఎంపీ సీట్లతో టిడిపి పార్టీ అధికారంలోకి రావటమే కాకుండా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నడపాలంటే తప్పకుండా టిడిపి పార్టీ మద్దతు అవసరమవుతుంది అని తెలిపారు. ఇప్పుడైనా బిజెపి ప్రభుత్వానికి చంద్రబాబు దాసోహం అనకుండా కేంద్రాన్ని బెదిరించైనా రాజకీయాలు పక్కన పెట్టి అన్ని పార్టీలను కలుపుకుని ప్రత్యేక హోదా కోసం కేంద్రంతో పోరాడాలని అందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ నే కాకుండా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతుంది అని తెలిపారు. ఇందుకు రాష్ట్రంలోని టిడిపి , వైసిపి ప్రత్యేక హోదా సాధించేందుకు కలిసి రావాలని, పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు.

భూ హక్కు చట్టం రద్దు హర్షణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు దస్తగిరిరెడ్డి

ప్రజల ఆస్తులకు భద్రత లేని ఎపిభూ హక్కుల చట్టం జీవో నంబర్ 512ను ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ప్రమాణ స్వీకారం తర్వాత రెండవ సంతకం చేసి రద్దు చేయడం పట్ల ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, బి.దస్తగిరి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం రైతు సంఘం జిల్లా కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చట్టం అమలులోకి వస్తే ప్రజలకు మంచి జరుగుతుందని గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతాంగానికి మాయమాటలు చెప్పి మోసగించారని తెలిపారు. రాజ్యాంగ విరుద్ధంగా ప్రత్యామ్నాయ రాచరిక వ్యవస్థలను నిర్మించుకునే విధంగా భూ హక్కు చట్టం 27/2023 లాంటివి తీసుకురావడం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను భంగపరచడమే అవుతుందని చెప్పారు. భూ యజమాని పేర్లను టైటిల్ రిజిస్టర్‌లో నమోదు చేయడానికి మండల స్థాయిలో ల్యాండ్ అథారిటీని అధికార పార్టీ నియమిస్తుందని పేర్కొన్నారు. చైర్మన్, కమిషనర్‌తో పాటు ముగ్గురు సభ్యులు ఉండేలా ల్యాండ్ అథారిటీని అధికార పార్టీ నియమిస్తుందని తెలిపారు. దీని వల్ల ప్రభుత్వం అధికార పార్టీ కన్ను సన్నల్లోనే ల్యాండ్ అథారిటీ, మండల టైటిలింగ్ ఆఫీసర్ అధికార పార్టీ చెప్పు చేతుల్లోనే ఉంటారని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్ భూ యజమానుల పేర్లను టైటిల్ రిజిస్టర్ల నిజాయితీగా నమోదు చేస్తాడని గ్యారెంటీ ఏం ఉంటుందన్నారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన మరుసటి రోజే నుంచి రాజకీయ పలుకుబడి ఉప యోగించి అధికార పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు ఇద్దరు కుమ్మక్కుతో అడ్డు అదుపు లేకుండా భూకబ్జాలకు పాల్పడతారని పేర్కొన్నారు. ప్రజల బాధలు ఎవరికి చెప్పుకోవాలో దిక్కు తోచని పరిస్థితి వచ్చిందని తెలిపారు. టైటిలింగ్ ఆఫీసర్ అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు విని పనిచేస్తారని చెప్పారు. పేదల భూములకు భద్రత లేని చట్టం అమలులోకి వస్తే నష్టపోయేది సామాన్య, పేద, మధ్య మధ్యతరగతి, చిన్న, సన్న కారు రైతులు అన్నారు. పేదల భూములను అక్రమ రికార్డులతో ఆక్రమించేవారు, భూకబ్జాదారులు. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు చట్టం రద్దు పై ప్రమాణ స్వీకారం రెండవ సంతకం చేసి రద్దు చేయడం హర్షణీయమని తెలిపారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- తారాజువ్వెత్తిస్తున్న టమోటా
- ఘాటెక్కిన పచ్చి మిర్చి
- వీటి బాటలోనే బీన్స్, క్యారెట్, కాకర
- కొత్తమీర కట్ట రూ.60
- ప్రజలకు తప్పని ఇక్కట్లు

పచ్చిమిర్చి ముట్టుకుంటే ఘాటెక్కుతోంది.. టమోటా ఒక్కసారి ఆకాశంలో ఎక్కి కూర్చుంది.. మేమేం తక్కువా అన్నట్లు అన్ని కూరగాయల ధరలు వాటి వెంటే కొండెక్కి కూర్చున్నాయి.. నెల రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చుకుంటే ప్రస్తుతం డబుల్ అవడంతో సామాన్య ప్రజలు వామ్మో అంటున్నారు.. మార్కెట్‌కు ఐదు వందల నోటుతో వెళితే... సగం బస్తా కూడా నిండడం లేదని ప్రజలు వాపోతున్నారు. మిర్చి ధర మార్కెట్‌లో రూ.100, కాకర రూ.60కి చేరింది. టమోటా రూ.60 నుంచి 80 మధ్యలో ఉంది. కొత్తమీర కట్ట కూడా టమోటా బాటలోనే ఉంది. ప్రతి వస్తువు ధర పెరిగి ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. కూరగాయల సాగు తగ్గిపోవడం, వర్షాలతో తోటలు దెబ్బతినడం వల్ల ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. మార్కెట్‌కు ఎక్కువగా దిగుబడులు వస్తే ధరలు అదుపులోకి వస్తాయని వ్యాపారులు చెబుతున్నారు.



ప్రజాశక్తి-రాయచోటి

కూరగాయల ధరలు సామాన్యుడు కొనే పరిస్థితి లేకుండా పోయింది. పెరిగిన ధరల వల్ల కిలో కొనేవారు..పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కంటే ఎంతో కొంత తక్కువ ధరకు లభిస్తాయనుకుని మార్కెట్‌కు వస్తే ఇక్కడి ధరలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండించే రైతుకు ఎంత వరకు గిట్టుబాటు ధర లభిస్తుందో గానీ...దళారులు మాత్రం బాగుపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో కూరగాయలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. వారి వంటింట్లో ఉడకనంటూ భీష్మించుకున్నాయి. సామాన్యుడు రూ.500 తీసుకుని మార్కెట్టుకు వెళ్తే పట్టుమని నాలుగు రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో టమోటాను పట్టుకుంటే దాని ధర తారాజువ్వెత్తిస్తోంది. పచ్చిమిర్చి ధర ఘాటెక్కి తనను ముట్టుకోవద్దంటోంది. ఇలా ప్రతి కూరగాయి సామాన్యుడిని ముట్టుకోనీయడం లేదు. ఎందుకంటే వాటి ధరలు అంత అమాంతంగా పెరిగి ఆకాశానికి నిచ్చనేశాయి. కనీసం పచ్చడి మెతుకులు తిందామనుకుంటే పచ్చిమిర్చి ధర రూ.100 చేరి అందనంత ఎత్తులో ఉంది. అన్నమయ్య జిల్లాలో ముఖ్యంగా రాయచోటి నియోజకవర్గంలో దేవపట్ల, సంబేపల్లి, చిన్నమండెం, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లి ప్రాంతాల్లో టమోటాల సాగు అధికంగా ఉంది. నెల కిందట రైతులకు గిట్టుబాటు ధరలు లేక టమోటాలను రోడ్లపైనే పారే వేసి వెళ్లేవారు. ఇటీవల టమోటా ధర బాగా పెరగడంతో ఇదేఅదునుగా దళారీలు సొమ్ము చేసుకుంటూ అధిక ధరలకు విక్రయించడం మొదలుపెట్టారు. ఇదేమిటి అంటే కూరగాయల సాగు తగ్గిందని ధరలు పెరిగాయి అంటూ చెప్పి సామాన్యులను దోపిడీ చేస్తున్నారు. గతంలో కిలో టమోటా ధర రూ.5, 10 ఉండగా నేడు ఏకంగా రూ.60 నుండి రూ.80 వరకు చేరింది. నిత్యం వంటకాల్లో టమోటా అవసరం తప్పదు కాబట్టి ఎంత ధర పెట్టి అయినా కొనుగోలు చేస్తున్నారు. వంకాయలు గతంలో కిలో రూ.20 నుండి రూ.30 ఉండగా నేడు అమాంతంగా రూ.40 నుంచి రూ.50, మునగ కిలో రూ.120 విక్రయిస్తున్నారు. నిత్యం కూరల్లో ఉపయోగించే ఉల్లిపాయలు కూడా గతంలో రూ.25 ఉండగా నేడు ఒక్కసారిగా రూ.50కు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వీధి దుకాణాల్లో కిలో రూ.60 చొప్పున అమ్ముతున్నారు. బీరకాయలు ధరలు కూడా సామాన్యుడికి అందుబాటులో లేకున్నాయి. సెంచరీ కొట్టింది. ఇక పచ్చిమిరపకాయల మాట ఎత్తుకుంటే కిలో రూ.వంద చొప్పున అమ్మకం సాగిస్తున్నారు. ఇదేమిటి అంటే ఈసారి పంట తక్కువగా ఉందని, గిరాకీ బాగా పెరిగిందని దుకాణదారులు చెప్పడం గమనార్హం. బెండకాయ రూ.50, పచ్చిమామిడి రూ.80, చిక్కుడు రూ.80, మటిక రూ.80, బూడిద గుమ్మడి ఒకటి రూ.60, అలసందలు రూ.100, తీపి గుమ్మడి రూ.40, క్యారెట్ కిలో 60, బీట్రూట్ రూ.60, ముల్లంగి రూ.60, కాకరకాయ రూ.90, క్యాబేజీ రూ.50, బీన్స్ రూ.140 చొప్పున విక్రయిస్తున్నారు. ఇక ఆకుకూరల ఆరోగ్యానికి ఎంతో మంచివని వైద్యులు చెప్పడంతో వాటి ధరలు సైతం ప్రస్తుతం మార్కెట్‌లో అమాంతంగా పెరిగాయి. ఏ ఆకు కూరను తీసుకున్నా రూ.10 ఉంది. ముఖ్యంగా మెంతి ఆకు, పాలకు, చుక్కాకు, గోంగూర, చింతాకు వంటివి కూడా అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక ఆదివారం వస్తే మాంసంలోకి కచ్చితంగా వాడే పుదీనా, కొత్తిమీర, అల్లం వంటివి కూడా ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు కొనాలంటే ఆందోళనకు గురవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ధరల నియంత్రించడంలో నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇది ఇలా ఉంటే రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ధరలను నియంత్రించాల్సిన అధికారులు ఏ ఒక్కరూ రైతు మార్కెట్ వైపు చూసిన పాపాన పోలేదు. కూరగాల తూకాల్లోనూ మోసం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధితాధికారులు రైతు బజార్లలో, మార్కెట్లలో సందర్శించి కూరగాయల ధరలు తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

ధరలు నియంత్రించాలి

మార్కెట్‌లోకి కూరగాయలు కొనడానికి వెళ్లాలంటే భయమేస్తోంది. గతంలో ఎప్పుడు లేని విధంగా కూర గాయల ధరలను పెంచేశారు. మార్కెట్లకు వెళ్తే ఏ కూరగాయలు కొని తినే పరిస్థితులలో లేం. అధికారులు స్పందించి కూరగా యల ధరలు వెంటనే నియంత్రించాలి.

- సరోజమ్మ, గృహిణి, రాయచోటి.

సంచుల్లోకి కూడా రావడం లేదు

కూరగాయలు మండి పోతున్నాయి. రోజూ వంట చేయాలంటే ఇబ్బందిగా ఉంది. ఏ కూర చేయాలో తోచడం లేదు. కూరల సమస్య. నోటికి రుచికరంగా చేసుకుందా మంటే ధరలు మండిపోతున్నాయి. కొత్త ప్రభుత్వమైనా ధరలు అదుపులో ఉంచాలి.

- కె.హరిప్రియ, గృహిణి, సంబేపల్లె.

వ్యాపారులు దోచుకుంటున్నారు

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ విపరీతంగా రేట్లను పెంచడంతో రవాణా ద్వారా ట్రాన్స్‌పోర్టు ద్వారా నిత్యావసర, కూరగాయలు రేట్లు అధికమయ్యాయి. దీని వల్ల రైతుల కంటే దళారులు ఎక్కువ ఫలితం పొందుతున్నారు. రైతులు, వినియోగదారులు నష్టపోతున్నారు.

- సి.రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య.



రాయచోటి కూరగాయల సంత

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలి

- సంస్థపై ప్రజల సంతృప్తికర స్థాయిని పెంచేలా పనిచేయాలి
- వర్షాకాలం విద్యుత్ ప్రమాదాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ



అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ

ప్రజాశక్తి - కడప

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించి సంస్థపై ప్రజల సంతృప్తికర స్థాయిని పెంచేలా పనిచేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గురువారం కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన ప్రాంతాలలో వినియోగదారులకు నివాసాలు ఉంటూ వారి విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడూ పరిష్కరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ విధిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధిక శాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యంతోనే సంభవిస్తున్నాయన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచడంలో భాగంగా విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా చూడాలన్నారు. విద్యుత్తును కొక్కేమల ద్వారా కాకుండా నాణ్యమైన సర్వీస్ వైర్ ద్వారా స్తంభం నుండి మీటర్ వద్దకు తీసుకునే విధంగా, భద్రతా నియమాలు విధిగా పాటించే విధంగా చూడాలన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి మరమ్మత్తైనా విద్యుత్ శాఖ సిబ్బందితో చేయించుకునే విధంగా ప్రజలలో అవగాహన కలిగించేందుకు వార్తాపత్రికల ద్వారా, లోకల్ టీవీల ద్వారా, ప్రత్యక్షంగా ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించి విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని తెలియ జేశారు. ఎర్తింగ్ చేయించుకోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ మధ్యకాలంలో ఒంటిమిట్టలో ఓ గృహంలో జరిగిన విద్యుత్ ప్రమాదం ఎర్తింగ్ చేసుకోకపోవడం వల్ల ప్రమాదం జరిగిందని తెలియజేశారు. కావున ప్రతి ఇంటికి విధిగా ఎర్తింగ్ చేయించుకునే విధంగా ప్రజలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1912 వినియోగించుకోవాలని తెలిపారు. మూగజీవాలు ముందు వెళ్తుంటాయని పొలాలలో తెగిపడిన విద్యుత్ లైను పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. విద్యుత్‌ను సరైన పద్ధతిలో భద్రతా నియమాలు పాటించి వాడుకుంటే సౌకర్యంగా విలాసవంతంగా ఉంటుందన్నారు. విద్యుత్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదాలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని విద్యుత్ కార్యాలయాలపై నా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, విధులలో అల సత్యం వహించిన ఉద్యోగులపై శాఖాభరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు, జెఇలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి నిరుద్యోగులకు వరం

కడప అర్బన్ : మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ కడప జిల్లా టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం కడప నగరం సంధ్యా సర్కిల్ వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొజ్జ తిరుమలేష్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అధికారంలోకి రాగానే మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేస్తానన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని తెలిపారు.



రక్తదాతకు పండ్ల రసం అందజేస్తున్న డాక్టర్ ఫరూక్

ఖూన్ కా రిష్తా సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

'రక్త సంబంధం కన్నా గొప్ప సంబంధం మరొకటి లేదు' ఈ స్ఫూర్తితో సకాలంలో రక్తం దొరక్క చనిపోతున్న అభాగ్యులని కాపాడుకోవాలనే దృఢసంకల్పంతో చైర్మన్ యం.తారిఖ్ అలీ 2015వ సంవత్సరంలో 'ఖూన్ కా రిష్తా' చారిటబుల్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా స్థాపించి సేవలు అందించడం అభినందనీయమని ప్రముఖ ఈఎన్టి వైద్యులు డాక్టర్ ఫరూక్ అన్నారు. గురువారం ప్రపంచ రక్త దాన దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్, ఖూన్ కా రిష్తా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాలు నుంచి రాష్ట్రంలో రక్త దాన ఆవశ్యకతను తెలియజేస్తూ అందరిలో రక్త దానం గురించి అవగాహన కల్పించడం హర్షనీయమన్నారు. వ్యక్తిగతంగా రక్తదానం చేయించడం, రాజకీయ, సినీ ప్రముఖుల పుట్టిన రోజు వేడుకలలో స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో రక్త దాన శిబిరాలను ఏర్పాటు చేసి రక్తదానం చేస్తూ ఉన్నారని తెలిపారు. రక్తదాతల కోసం http://www.khoonkarishta.com వెబ్ సైట్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అందులో స్వచ్ఛందంగా డోనర్స్‌లను రిజిస్టర్ అయ్యేటట్లు చేసి వారి చేత అత్యవసర పరిస్థితులలో రక్తం అవసరమున్న చాలా మంది రోగులకు, గర్భిణులకు డెలివరీ సమయంలో రక్తం చేయిస్తూ ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో తారీక్ ఆలీ, డాక్టర్ పల్లా భాస్కర్, డాక్టర్ గోపీనాథ్, రక్తదాతలు పాల్గొన్నారు.

ప్రజా విజయం ఎన్‌టిఆర్‌కి అంకితం

ప్రజాశక్తి - కడప అర్బన్



ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కొండా సుబ్బయ్య

ఆంధ్రప్రదేశ్ ప్రజలు టిడిపికి చారిత్రాత్మక విజయం ఇచ్చి ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడుకి కడప నగర టిడిపి ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం నగరంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ప్రజా విజయం ఎన్టీఆర్‌కు అంకితమని చెప్పారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధన దిశగా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాలు అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి ఆధ్వర్యంలో నగరం అన్ని విధాల ముందుకెళ్తుందని తెలిపారు. రాయచోటి ఎమ్మెల్యే మండపల్లి రాంప్రసాద్ రెడ్డికి మంత్రి పదవి ఇచ్చినందుకు చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కడప జిల్లా మహిళా అధికార ప్రతినిధి కతారి స్వర్ణలత, జిల్లా ఎసి సెల్ కార్యదర్శి మేకల దేవా, మేరీ నగర్ శరత్, సంపత్, గంగాధర్ పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల అక్రమాలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎపి వాణిజ్య పన్నులశాఖలో ఐదేళ్లగా కొందరు ఉన్నతాధికారులు సాగించిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎపి వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు జె.వి.రమణయ్య, కార్యదర్శి ఎస్. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.హరికృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయానికి వెన్నెముకగా ఉన్న వాణిజ్య పన్నుల శాఖని కొందరు ఉన్నతాధికారులు సాగించిన అక్రమ విధానాల కారణంగా, పునర్ వ్యవస్థీకరణ పేరుతో శాఖను నిర్వీర్యం చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో కొందరు ఉన్నతాధికారులు పూర్తి అధికారాలను తమవద్ద ఉంచుకుని క్షేత్రస్థాయిలో సర్కిల్ కార్యాలయాలను నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. జూనియర్, సీనియర్ అసిసెంట్స్ పోస్టులను రద్దు చేశారని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371(డి)కి విరుద్ధంగా, రాష్ట్రపతి ఉత్తర్వులు ఉల్లంఘించి బదిలీలు చేశారని పేర్కొన్నారు. ఏడాదిలో పదవీ విరమణ చేయనున్న వారిని మిగులు సిబ్బంది నెపంతో అక్రమ బదిలీలు చేశారని తెలిపారు. ఉద్యోగుల, అధికారుల అసోసియేషన్ అభ్యర్థనలను, ఫిర్యాదులను పెడచెవిన పెట్టిన కొందరు ఉన్నతాధికారుల అక్రమ చర్యలపై సమగ్ర ఉన్నత విచారణ చేపట్టాలన్నారు.

జనసేన కార్యకర్తల సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిప్యూటీ సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా నగరంలోని అక్కాయపల్లిలో ఆ పార్టీ నాయకులు పండ్రా రంజిత్ కుమార్, రాజగోపాల్ ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. గురువారం వివిధ సర్కిళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కేక్ కటింగ్, బాణాసంచా కాలుస్తూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పవన్ కల్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రాజేంద్ర, బాలాజీ, హరి, బాలు నాయక్, కుమార్ నాయక్, సుధీర్ నాయక్, సాయి కృష్ణ, ఆచారి, రూప్‌కుమార్, నాగరాజ్ ప్రసాద్ పాల్గొన్నారు.



బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న జనసేన కార్యకర్తలు



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

మనోధైర్యం కోల్పోకుండా ముందుకు వెళ్దాం

- ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మనోధైర్యం కోల్పోకుండా ముందుకు వెళ్దామని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కార్యాలయంలో గురువారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పట్టణానికి చేరుకొని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి కొన్ని సమస్యలు తీసుకొచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ వీలైనంత త్వరలో మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గతంలో లాగానే పార్టీకి పనిచేయాలని, మీకు ఏ కష్టం, నష్టం వచ్చినా అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన మాజీ చైర్మన్

వేంపల్లె : కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కుర్రాకుల వెంకటేష్ కలిశారు. గురువారం పులివెందులలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీకి పలు సమస్యలను విన్నవించారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటామని ఎంపీ చెప్పారని కుర్రాకుల వెంకటేష్ తెలిపారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న వేరుశనగ కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గురజాల రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రభుత్వం రాయి తీతో వేరుశనగ కాయలు ఇవ్వనుందన్నారు. కావలసినవారు రైతు భరోసా కేంద్రంలో తమ పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ నేపథ్యంలో తీసుకోవాల్సిన అంశాలపై రైతులతో క్షుణ్ణంగా చర్చిం చారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది చరణ్, రైతులు పాల్గొన్నారు.



మధుసూదనరెడ్డిని సన్మానిస్తున్న అంగన్వాడీలు

డాక్టర్ మధుసూదనరెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఎన్‌డిఎ కూటమి మండల నాయకులు డాక్టర్ మధుసూదనరెడ్డిని గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మధుసూదనరెడ్డిని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రనాథ్ రెడ్డి, అబ్దుల్ ఖాదర్, వినోద్, ఓబులేసు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చాపాడు మండలం పల్లవోలుకు చెందిన పల్లవోలు రమణకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రమణ మాట్లాడుతూ 21 పర్యాయాలు రక్తదానం చేసినట్లు తెలిపారు. చాలామందితో రక్తదానం చేయించానన్నారు. మృతి చెందిన 27 మంది నేత్రాలను సేకరించి, 54 మంది కార్నియా అంధులకు చూపు వచ్చేందుకు ప్రయత్నించానన్నారు. రక్తదానంతోపాటు మరణానంతరం నేత్రదానాన్ని శరీర దానాన్ని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి వైద్యులు వై.హిమాదేవి, గోపాల్, దిలీప్, సూపరింటెండెంట్ ఆనందబాబు, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది మహేష్, సూరజ్, ప్రసాదరెడ్డి, రామకృష్ణ, రోజమ్మ పాల్గొన్నారు.



క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపవరం

స్థానిక సిద్ధవటం మెయిన్ రోడ్డులో ఉన్న ఓ ఇంటిలో గురువారం మంటలు చెలరేగడంతో గోపవరం 108 డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న కలసపాడుకు చెందిన సాయి కుమార్‌రెడ్డి (27) మృతి చెందాడు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా లేక మరే ఇతర కారణాలైనా ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక కేంద్ర ఇన్‌ఛార్జి ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, సిబ్బంది మంటలను అదుపు చేశారు. సంఘటన స్థలాన్ని అర్బన్ సిఐ యుగంధర్ పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



కడప రోడ్డు హైవే సమీపంలో నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో పలు లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. వర్షపు నీరు వంకలు, ఇతర ప్రాంతాలకు ప్రవహించే ఏర్పాటు లేకపోవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయి. ముఖ్యంగా కడప రోడ్డులోని సాయినాథపురం, బద్వేల్ రోడ్డులోని సుందరయ్య కాలనీ వద్ద నీరు అధికంగా నిలుస్తున్నది. బద్వేల్ రోడ్డులోని జోసఫ్‌పేట, శాంతి నగర్, మహబూబ్ నగర్, మార్కెట్ రోడ్డు, కడప రోడ్డులోని మసీదు రోడ్డు, రిజిస్టర్ కార్యాలయం రోడ్డు, బస్టాండ్, నంద్యాల రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డులోని కేసీ కాలువల వద్ద నీటి కుంటలు ఏర్పడుతున్నాయి. వీటిల్లో పందుల బెడద అధికంగాఉంది. మున్సిపాలిటీ పరిధిలో 120 వరకు నిల్వ ఉండే మురికి కుంటలు ఉన్నట్లు ఆరోగ్య శాఖ సిబ్బంది గుర్తించారు. మురికి కుంటల్లో దోమలు నిలువ ఉంటూ ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ మురికి కుంటలను ఆధారం చేసుకొని పందులు అధికంగా తిరుగుతున్నాయి. ప్రధాన రహదారి వెంబడి పందులు ఒక్కసారిగా రోడ్డు దాటుతూ ద్విచక్ర వాహనదారులను ఢీకొంటున్నాయి. పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు పలు దఫాలు పందుల యజమానులు పిలిపించి మాట్లాడినప్పటికీ ఉపయోగం లేదు. అందులో పందుల యజమానులను మున్సిపాలిటీ వర్కర్లుగా విధుల్లోకి తీసుకుంటామని కచ్చితమైన హామీ లేకపోవడంతో వారు పందుల పెంపకాన్ని వదిలేయడం లేదు. అయితే వాటిని ఒక చోట సంరక్షించు కోకుండా ఇష్టానుసారంగా వదులుతున్నారు. దీంతో అవి మురికి కుంటల్లో తిరుగుతూ దుర్వాసనను వెదజల్లుతూ రోగాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఉన్న లోతట్టు ప్రాంతాలను గుర్తించి వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాను వైఎస్ఆర్ కడపగా మార్చాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి తొలి ప్రవేశద్వారంగా ఉండి కాలక్రమేణా దేవుని గడప, దేవుని కడప అనంతరం కడపగా మారిన జిలా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మార్చాలని ప్రముఖ హృద్రోగ నిపుణులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన హామీల ప్రత్యేకహోదా సాధనా సమితి అధ్యక్షులు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. 2022లో జగన్ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా పేరును వైఎస్సార్ జిల్లాగా మార్చిందన్నారు. ఈ నిర్ణయం కడప జిల్లా ప్రజలకు తీవ్ర బాదను కలిగించిందన్నారు. కడప అనే పదానికి వేల సంవత్సరాల ఘనమైన చరిత్ర ఉందన్నారు. తిరుమల తిరుపతి పదాలకు ఎంతటి పవిత్రత, విశిష్టత ఉందో అంతే పవిత్రత కడప అనే పదానికి ఉందన్నారు. ఈ ప్రాంత అస్తిత్వం కడప అనే పేరుతో ముడిపడి ఉందన్నారు. కడప అనే పేరుమీద సర్వహక్కులు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి మాత్రమే ఉన్నాయన్నారు. వేల సంవత్సరాల ఘనమైన చరిత్రను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. కడప అనే పదాన్ని పునరుద్ధరించి జిల్లా పేరును వైఎస్సార్ కడపగా మార్చాలని ఆయన కోరారు.

విద్యా బోధన పటిష్టతకు ప్రణాళికలు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన పటిష్టంగా అమలు చేసేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు గురువారం ప్రారంభం కావడంతో ఆయన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హజరు పట్టికలను పరిశీలించారు. ప్రవేశాలకు వచ్చే ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు అందరూ కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచాలని కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన ప్రభుత్వం సరఫరా చేస్తున్న పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం భోజనం పథకాన్ని కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులందరికీ ఉచితంగానే పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన వివరించారు. విద్యాబోధనపై ప్రత్యేకదృష్టి పెట్టామన్నారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు శివ మునెమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హాజరు పట్టికలను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప

కేన్సర్ బారి నుంచి ప్రజలను కాపాడాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కేన్సర్ వ్యాధి బారి నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైయస్ఆర్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి, సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాజా మొయిద్దీన్ పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ వైయస్ఆర్ సర్వజన ఆసుపత్రి ఆవరణలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ, ప్రాథమిక వైద్యాశాల సిహెచ్‌ఒ, ఏఎన్‌ఎంలకు 3 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఏఎన్‌ఎం, సిహెచ్‌ఒలకు కేన్సర్ వ్యాధిని త్వరితగతిన కనుగొనేందుకు మెళకువలను అనుభవజ్ఞులు అయిన వైద్యులచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ విఘ్నేష్, సోషల్ ప్రివేంటివ్ మెడిసిన్ హెచ్‌ఒడి డాక్టర్ శంకర్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నటేష్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ కేశవ కుమార్, ఆర్బిఎస్‌కె ఆఫీసర్ నవీన్ పాల్గొన్నారు.

ఎపిజిఎల్ఐసి బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుల ఎపిజి ఎల్‌ఐసి బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీయు నాయకుడు నరసింహరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగ విరమణ చేసి 8 నెలలు గడుస్తున్నా గత ప్రభుత్వం ఎపిజి ఎల్‌ఐసికి సంబంధించిన బకాయిలు చెల్లించలేదన్నారు. 2022 మార్చి నాటికి ఎపిజి ఎల్‌ఐసి బాండ్ కాలం పూర్తయిందన్నారు. సర్వీస్‌లో ఉన్న, ఉద్యోగ విరమణ ఉపాధ్యాయులకు సంబంధించిన అంశాలు నిధి పోర్టల్‌లో కనిపించకపోవడం శోచనీయం అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉద్యోగ విరమణ ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వమైనా చొరవ చూపి ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని ఆయన కోరారు.

అధ్యాపకులు బోధనలో మెలకువలు సాధించాలి

బోధనపై అధ్యాపకులతో ప్రొఫెసర్ బివి.రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

అధ్యాపకులు బోధనలో మెలకువలు సాధించి తరగతి గదుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కెనడా అంటారి యొటెక్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ బివి రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో అధ్యాపకులతో బివి రెడ్డి ఇంటరాక్టివ్ సెషన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు బోధన, రిసెర్చ్‌లో పురోగతి సాధించాలని కోరారు. అప్పుడే విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. క్వాలిటీ రిసెర్చ్ పేపర్స్ రాసి వివిధ ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమయ్యేలా చూడాలని కోరారు. ఇప్పటి పరిస్థితుల్లో గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడానికి బయోమాస్, సోలార్ ఎనర్జీ, బొగ్గును ఉపయోగించి హైబ్రిడ్ పవర్ జనరేషన్‌ను ఉత్పత్తి చేసేలా ప్రయోగాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, డీన్ అకాడమిక్ రత్నకుమారి, ఎఒ డాక్టర్ రవికుమార్, సిఒఇ డాక్టర్ రమేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కొండారెడ్డి, అధ్యాపకులు, ఆయా శాఖల ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

సమాజసేవలో సంతృప్తి ఉంది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సమాజసేవలో ఆత్మసంతృప్తి ఉందని కొవ్వూరు ట్రాన్స్‌పోర్ట్ అధినేత సీనియర్ రోటేరియన్ కొవ్వూరు గ్రాండ్ అధినేత రమేష్‌రెడ్డి అన్నారు. యర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు గురువారం ఆయన వీల్‌ఛైర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చిరుకానుకగా ఈ వీల్‌ఛైర్‌ను అందిస్తున్నామన్నారు. ఇక్కడి రైల్వే ప్రయాణికుల అవసరార్థం అవసరమైనవి తెలిపితే తన శక్తికొద్ది అందజేస్తామన్నారు. రోటరీక్లబ్ కార్యదర్శి గజ్జల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో అవయవదానంపై అవగాహన కలిగించేందుకు రమేష్‌రెడ్డి పాదయాత్ర చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ జీలాన్, రోటరీక్లబ్ పూర్వ అధ్యక్షుడు రామకృష్ణ, అయూబ్‌ఖాన్, కోశాధికారి బాలసూర్యారావు, పల్స్‌పోలియో అధికారి శ్రీధర్‌శర్మ, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉపకారవేతనానికి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నరహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు ఎన్.ఓబులేష్, బి.శివనాగేశ్వరి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు నరసింహ శాస్త్రి తెలిపారు. ఈ పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు రూ.12వేల చొప్పున స్కాలర్ షిప్ మంజూర వుతుందన్నారు. ఈ పరీక్షకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు సురేంద్రబాబు, మురళీను, ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అభినందించారు. స్కాలర్ షిప్‌నకు ఎంపిక కావడం వల్ల తల్లిదండ్రులకు ఆర్థికంగా ఉపయోగం ఉంటుందన్నారు. మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. పోటీ పరీక్షలలో పాల్గొనాలనే తపన పెరుగుతుందన్నారు. మిగిలిన విద్యార్థులు కూడా రాబోయే రోజుల్లో పోటీ పరీక్షల్లో పాల్గొని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు ప్రారంభం



ఇందిరమ్మ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ప్రవేశాలు

ప్రజాశక్తి - మైదుకూరు

వేసవి సెలవుల అనంతరం గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. మండలం వ్యాప్తంగా బడిగంటలు మోగాయి. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు ముమ్మరమయ్యాయి. పలువురు విద్యార్థులు తాము చదివిన తరగతి కాకుండా ఉన్నత తరగతులకు వెళ్లడంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రయివేట్ పాఠశాలలు తమ వ్యాపారాన్ని పుస్తకాలు, యూనిఫామ్ విక్రయాలతో ప్రారంభించాయి.



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీ సౌజన్య

క్షయ వ్యాధి నివారణకు సహకరించాలి

స్టేట్ టిబి నోడల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ సౌజన్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లా వ్యాప్తంగా పెద్దలకు టిబి టీకా కార్యక్రమం సందర్భంగా గురువారం గోపవరం పంచాయతీలోని ఆచార్ల కాలనీలో కార్యక్రమాన్ని స్టేట్ టిబి నోడల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ సౌజన్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరికీ త్వరగా టీకా అందించాలని, ప్రజలు కూడా క్షయ వ్యాధి నివారణలో ఆరోగ్య సిబ్బందికి సహకారం అందించాలన్నారు. పెద్దలకు టిబి టీకా సోమవారం, గురువారం ఉచితంగా వేస్తారని పేర్కొన్నారు. జిల్లా అడిషనల్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ నెల రోజులుగా ఈ కార్యక్రమం అన్ని సచివాలయాల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కలిగించి ఆగస్టులోగా లక్ష్యాన్ని నెరవేర్చాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు టిబి యూనిట్ నివారణ అధికారి డాక్టర్ శివ ప్రసాద్ రెడ్డి, కామనూరు పిహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్స్ రాజారత్నం, కష్ణమ్మ, బిఎ వరప్రసాద్, చంద్రకళ, మున్నా, గంగా, శ్రీదేవి, ఆరోగ్య సిబ్బంది బేబీ, సుమలత, చంద్రశేఖర్ ఆశా కార్యకర్తలు కళ్యాణి, రంగమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు: అర్హులైన వయోజనులకు బిసిజి టీకాలు వేయాలని స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ లక్ష్మీ సౌజన్య తెలిపారు. స్థానిక వైయంఆర్ కాలనీ కెసి పుల్లయ్య అపార్ట్‌మెంట్‌లో ఆమెతోపాటు జిల్లా టిబి అధికారి రవిబాబు బిసిజి వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివప్రసాదరెడ్డి, దినేష్ బాబు, డివి యంఒ శివశంకరయ్య, టి.బి.సూపర్‌వైజర్ రాజారత్నం, హెల్త్ విజిటర్ సిద్ధా రెడ్డి, ప్రసాద్, మున్నీ, సిఒయం వి.సుబ్బారెడ్డి, ఏయన్‌యంలు, ఆశాలు పాల్గొన్నారు.